క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



అప్పనపల్లిలో దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం పలువురు విరాళాలు అందించారు. మామిడికుదురుకు చెందిన గుబ్బల శ్రీనివాస్, మంగాదేవి దంపతులు రూ.10,115 విరాళం అందించారు. అప్పనపల్లికి చెందిన సింహాద్రి సత్యసాయి బాల సుబ్రహ్మణ్యం వారి కుటుంబ సభ్యులు రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను ఆలయ ఉద్యోగులకు అందజేశారు. విరాళం అందించిన దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అంతర్వేది ఆలయంలో ఆర్జేసీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం ఎండోమెంట్స్ రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) కె.సుబ్బారావు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదం, చిత్రపటంను సూపరింటెండెంట్ పీ విజయ సారధి, ఆయనకు అందజేశారు.

గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు 19 వరకు తుది గడువు

అంబాజీపేట: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లుగా చేరేందుకు వచ్చే నెల 19 వరకు గడువు ఉందని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. అర్హులైన వారు అంబాజీపేట తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురణ చేశామన్నారు. వాటిలో ఏమైన సవరణలు ఉంటే దరఖాస్తు ద్వారా తెలపాలన్నారు.

నూతన భవనంలోకి యూనియన్ బ్యాంకు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలోని యూనియన్ బ్యాంకు శాఖ కార్యాలయం సోమవారం నూతనంగా నిర్మించిన భవనంలోకి మారింది. ఈ మేరకు నూతన భవనాన్ని అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, బ్రాంచి మేనేజర్ యు రవిబాబు, పలు శాఖల బ్రాంచి మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

అంబాజీపేట: ప్రతి కార్డుదారునికి రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సోమవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న రేషన్ కార్డు దారునికి పంచదార, బియ్యం, కందిపప్పు విధిగా విక్రయించాలన్నారు. అందుకు అవసరమైన సరకులను డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు అందించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారి ఇంటి వద్ద వాహనాన్ని ఆపి రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ సరుకులను ప్రతి కార్డు దారుడు అడిగి తీసుకోవాలని తహసీల్దార్ కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

అలమూరు: మండలంలోని చింతలూరులోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం కంటి వెలుగు పథకంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు జరిగాయి, నేత్ర వైద్య నిపుణురాలు కె.శ్రీలక్ష్మీ విచ్చేసి సుమారు 50 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి ఆ మేరకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆమె వివరించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచనలో ముక్తేశ్వరం విద్యార్థినుల ప్రతిభ



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆశ్రిత, మంజుశ్రీ

అయినవిల్లి: 'షైన్ ఫౌండేషన్ ' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమలాపురంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ముక్తేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మానేపల్లి సాయిఆశ్రిత (ఇంగ్లీష్ మిడియం), పదం మంజుశ్రీ (తెలుగు మీడియం) ప్రథమ స్థానంలో గెలుపొందారు. ఆ సంస్థ కోఆర్డినేటర్ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందుకున్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, మండల ప్రముఖులు అభినందించారు.

హరహర మహాదేవ..

- ఆఖరి కార్తిక సోమవారం
- భక్తులతో శివాలయాల కిటకిట

కొత్తపేట: కార్తికమాసం..ఆఖరి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్ని శివాలయాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ప్రధానంగా పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుంచి తరలివచ్చారు. ఆలయ మండపం, వెలుపల ప్రాంగణంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం సిబ్బంది, పలువురు స్థానికులు, కాంతిభారతి విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు వివిధ సేవల్లో పాల్గొన్నారు. స్థానిక హరిహరదేవాలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరీ సమేత రాజేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆఖరి కార్తిక సోమవారం సందర్భంగా పలివెల, కొత్తపేట ఆలయాల ప్రాంగణాల్లో భక్తులు అఖండ దీపోత్సవం నిర్వహించారు. శివలింగం, వివిధ దేవతా మూర్తుల ఆకృతుల్లో దీపాలను అమర్చి ఆ దీపాలను వెలిగించారు. పలివెల ఉమా కొప్పేశ్వరస్వామివారి భక్తుల సహకారంతో ఆలయ అన్నదాన కమిటీ కన్వీనర్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రి అన్నసమారాధన నిర్వహించారు. కొత్తపేట హరిహర దేవాలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరీ సమేత రాజేశ్వరస్వామి వారి ఆలయంలో కాపు యువత నాయకుడు సలాది రామ్మోహనరావు (చిన్ని) దంపతుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. రాత్రి అన్నసమారాధన జరిపారు.

వైభవంగా జ్యోతిర్లింగార్చన

రావులపాలెం: మండలంలోని ఊబలంక ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తిక మాసం సందర్భంగా జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. గ్రామ వేద పండితులు దేవరభట్ల భానుమూర్తి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజ నిర్వహించి, అభిషేకాలు లక్షపత్రి పూజ, అమ్మవారి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే ముమ్మిడివరప్పాడు ఉమా వీరేశ్వర స్వామి ఆలయంలోనూ జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.



ఆలమూరులో విక్రమ భట్టేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

అంబాజీపేట: కార్తిక ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు వేకువజాము నుంచి భక్తులతో కిక్కిరిసిపోయాయి. పశ్చిమ గోదావరి నుంచి సుమారు 3 వేల మంది, స్థానిక భక్తులు ఏకదాశ రుద్రులను దర్శించుకుని పూజలు చేశారు. మాచవరంలో పార్వతీ సమేత రాజేశ్వర స్వామి, కందుల మల్లేశ్వర స్వామి, పుల్లేటికుర్రులో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి, అలాగే మండలంలోని పలు ఆలయాల్ల కార్తిక పూజలు సుందరంగా జరిగాయి.

పి.గన్నవరం: చివరి సోమవారం సందర్భంగా లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. మొగలికుదురులోని చౌడేశ్వరీ ఉమారామలింగేశ్వరస్వామి, పోతర్లపూడిలోని ఉమాచెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో లక్ష బిల్వార్చన వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, పార్వతీ దేవికి లక్ష కుంకుమార్చన పూజలను వైభవంగా జరిపించారు. కార్తిక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి.



జి.అగ్రహారం స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

పుణ్యక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: హరిహరులకు ప్రీతికరమైన కార్తిక మాసంలోని చివరి సోమవారం శైవ, వైష్ణవ పుణ్యక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శివాలయాల్లో స్వామికి లక్ష బిల్వ పత్రాలతో పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీ దేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వైష్ణవ ఆలయాల్లో లక్షతులసి పత్రాలతో పూజలు చేశారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో వేపచెట్టు వద్ద, ప్రధాన గోపురం వెనుకవైపు భక్తులు దీపారాధనలు చేశారు. అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వర స్వామి, గుడిమూల కృతకృత్య రామలింగేశ్వరస్వామి వారి క్షేత్రాలకు భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయాల్లో నందీశ్వరుని వద్ద, జమ్మిచెట్టు వద్ద, ధ్వజస్తంభాలు వద్ద భక్తులు దీపారాధనలు చేశారు.

అయినవిల్లి: మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ముక్తేశ్వరంలోని క్షణముక్తేశ్వరుని ఆలయం, సిరిపల్లి కనకేశ్వరస్వామివారి ఆలయం, అయినవిల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుని ఆలయం, నేదునూరు చెన్నమల్లేశ్వరుని ఆలయం, వీరవల్లిపాలెంలోని వీరేశ్వరుని ఆలయం ఇలా మండలంలోని పలు గ్రామాల్లోన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు.



ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వర స్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తిక మాస చివరి సోమవారం కావడంతో శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని మడికి బాలా త్రిపురసుందరీ సమేత సోమేశ్వరస్వామి. దక్షిణ కాశీగా పేరొందిన జొన్నాడ గౌతమీ తీరాన ఉన్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, మూలస్థానం అగ్రహారంలోని ఉమా మూలేశ్వర స్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే విశేష సంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చి అభిషేకాలు నిర్వహించి కార్తిక దీపాలను వెలిగించారు. మండలంలోని చివరి కార్తిక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో కార్తిక వనసమారాధనలు జరిగాయి. ఆలమూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ట్రాన్స్‌కో ఏఈ డీఎంకే దుర్గా ప్రసాద్ నేతృత్వంతో విద్యుత్ ఉద్యోగులు ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించి సుమారు రెండు వేల మందికి వన సమారాధన చేశారు. అలాగే సందిపూడిలో మోటుపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని రైసుమిల్లు వద్దనున్న జమ్మిచెట్టు వద్ద సుమారు వెయ్యి మందికి అన్నసమారాధన జరిగింది. అలాగే అనేక మంది భక్తులు ఆయా ప్రాంతాల్లో వనసమారాధనలు జరుపుకున్నారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి వార్షికోత్సవం

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో పంచముఖ ఆంజనేయస్వామివారి ఆలయ చతుర్థ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని, ఆ పరిసరాల్లో వనవాస కాలంలో పర్ణశాల వద్ద సీతారామలక్ష్మణుల ఘట్టాన్ని రంగులతో ముస్తాబు చేసి, రకరకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త గొలకోటి మాచరరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వేదపండితుల బృందం సుమారు 50 మంది దంపతులతో స్వామికి విశేష పూజలు జరిపించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి వరకూ బాలలతో కూచిపూడి, భరత నాట్యం, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆంజనేయస్వామిని అలంకరించుకున్న వృషభ, గజ, అశ్వ, హంస, ఒంటె వాహన రథాలు, వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



గొలకోటివారిపాలెంలో విశేష అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి క్షేత్ర ప్రాంగణం

కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని వేదపండితులు వేదాశీర్వాదం, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేలాది మందితో వైభవంగా ఆలయ వార్షికోత్సవం నిర్వహించిన ఆలయ నిర్మాతను అభినందించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

కొత్తపేట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ పాల్గొని ప్రతిభను చాటాలని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు సూచించారు. సోమవారం ఫాదర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా హ్యారీ క్రౌ బక్ జయంతి సందర్భంగా కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ డే ను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాపారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా హ్యారీ క్రౌ బక్ చిత్రపటానికి డాక్టర్ పాపారావు పూలమాలనువేసి ఘనంగా నివాళులర్పి ంచారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులందరూ ప్రతి క్రీడా పోటీల్లోనూ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఫిజికల్ డైరెక్టర్ కె.కనకరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక చేసేటప్పుడు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తపేటలో హ్యారీ క్రౌ బక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాపారావు

పశు సంపద పెరుగుతోంది

అంబాజీపేట: జిల్లాలో పశు సంపద పెరుగుతోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కర్నీడిమూర్తి చెప్పారు. నందంపూడిలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పితాని బాల నాగమ్మ ఇంటివద్ద సోమవారం జరిగిన పశు సంపద గణనలో మూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లోని 426 గ్రామాలలో 4, 93,465 గృహాలు సందర్శించి పశుసంపదను నమోదు చేస్తామన్నారు. ఇందుకు 282 మంది గణకులను నియమించామన్నారు. ఈ సర్వేను ఈ నెల ఒకటో తేదీన ప్రారంభించామని ఇప్పటికి 83,476 ఇళ్లను సర్వే చేశామన్నారు. 2025 ఫిబ్రవరి నెలాఖారుకు గణన పూర్తి చేస్తామన్నారు. ఈ సర్వేలో ఆవులు, గేదెలు, కుక్కలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గుర్రాలు, తదితర జంతువులను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. గత ఐదేళ్లతో పోలిస్తే పశుసంపద పెరుగుతోందని, దేశవాళీ ఆవులను ఎక్కువగా ప్రజలు పోషిస్తున్నారన్నారు. ఈ పశుగణన వల్ల ప్రభుత్వానికి బడ్జెట్, పథకాల రూపకల్పన, గడ్డి, దాణా, మందులు సరఫరా చేయడం సులువవుతుందన్నారు. సహాయ సంచాలకులు విజయరెడ్డి, స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ డి.రాజేంద్ర ప్రసాద్, నందంపూడి సచివాలయ పశువర్ధక శాఖ సహాయకురాలు సునీత పాల్గొన్నారు.



నందంపూడిలో పశుగణన సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ మూర్తి

ఉపాధ్యాయిని కుటుంబానికి ఎస్టీయూ సాయం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత టీచర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన గేదెల సునీత కుటుంబ సభ్యులకు ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఎస్టీయూ అభయ్ ద్వారా రూ.రెండు లక్షల చెక్కును సోమవారం అందజేశారు. ఈ మేరకు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పై చెక్కును జిల్లా సంఘ అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పళ్లంరాజు ఇచ్చారు. వారు మాట్లాడుతూ, సర్వీస్‌లో ఉండగా అనుకోని విధంగా మరణించిన ఎస్టీయూ సభ్యులకు సదరు సంఘం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. ఎంఈవో-1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, ఎస్టీయూ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యు.గిరిబాబు పాల్గొన్నారు.



సునీత కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

సుజాతకు గద్దర్ జాతీయ సేవా పురస్కారం

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయిని సాక సుజాత గుమ్మడి విఠల్‌రావు గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.గన్నవరం సత్యసాయి జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిసెంబర్ 12న మమత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుమ్మడి విఠల్‌రావు గద్దర్ జాతీయ సేవా పురస్కార కార్యక్రమం నిర్వహించనున్నారు.



సాక సుజాత

వివిధ రంగాల నుంచి సేవాతత్పరులను ఆ కార్యక్రమంలో సత్కరించనున్నారు. ఉపాధ్యాయినిగానే కాకుండా వివిధ రూపాల్లో సేవలు అందిస్తూ హైదరాబాద్ చంద్రాయణగుట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న గంటి పెదపేటకు చెందిన సాక సుజాత (రచన) గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికై నట్టు మమత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కె.జాన్ సోమవారం తెలిపారు.

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు మనోజ్

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కొప్పిశెట్టి మనోజ్ ఎంపికైనట్లు హెచ్ఎం కె.సూర్యకనక దుర్గ, పీడీ అందె సూర్యనారాయణలు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పలువురు మనోజ్‌ను అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 23న కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో బీచ్ వాలీబాల్ పోటీలు జరిగాయి. బాలుర అండర్-14 విభాగం కొప్పిశెట్టి మనోజ్ అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నాడన్నారు. మనోజ్‌కు సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.రతన్నమాల, ఎంపీటీసీలు కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, ఉప సర్పంచ్ వీరా రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



పుల్లేటికుర్రులో రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన మనోజ్‌తో హెచ్ఎం, పీడీ

అక్విడెక్టు సమీపంలో ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు

- జేసీబీతో బాట వేస్తున్న అక్రమార్కులు
- చారిత్రక కట్టడానికి పొంచి ఉన్న ప్రమాదం

పి.గన్నవరం: ఉచిత ఇసుక మాటున అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి ఇసుకను దోచేస్తున్నారు. పి.గన్నవరం పాత అక్విడెక్టుకు దిగువనున్న ఇసుక తిన్నెలపై కూటమి నేతల కన్ను పడింది. దీంతో బోట్సుమెన్ సొసైటీ వినియోగించే ర్యాంపులోకి రెండు రోజుల క్రితం జేసీబీని తీసుకువచ్చారు. అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా సోమవారం ఉదయం ర్యాంపు నుంచి నదిలోకి జేసీబీతో బాట ఏర్పాటుకు యత్నించారు. ఈ ప్రాంతం అక్విడెక్టుకు అతి సమీపంలో ఉంది. ఇక్కడి నుంచి అక్రమంగా ఇసుకను తరలించుకుపోయేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అక్విడెక్టుకు 500 మీటర్ల దూరంలోపు ఇసుక తవ్వకాలు జరుపకూడదు.

ఈ నిబంధనను కూడా ఉల్లంఘించి అక్రమార్కులు బాట వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం రచ్చకావడంతో సాయంత్రం అధికారులు రంగం ప్రవేశం చేశారు. దీంతో అక్రమార్కులు జేసీబీని తుప్పల్లో పెట్టి పరారయ్యారు.



పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో ఇసుక ర్యాంపునకు జేసీబీతో బాట వేస్తున్న దృశ్యం

అక్విడెక్టుకు అతి సమీపంలో ర్యాంపు వేయడంతో చారిత్రాత్మక కట్టడానికి ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ర్యాంపు వేస్తే రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న కారణంగా ఇటీవల బోట్సుమెన్ సొసైటీ సభ్యులు పడవలపై ఇసుక తీసేందుకు ప్రయత్నించగా అధికారులు నిలిపివేసిన విషయం విదితమే.

నిమ్మలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కొత్తపేట: నిమ్మ తోటల్లో పూత దశ నుంచి తగిన యాజమాన్య పద్ధతులు తీసుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడులతో అధిక ఆదాయం పొందవచ్చని స్థానిక ఉద్యాన అధికారి (హెచ్ఓ) జి.కోటేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని వాడపాలెం సమీపాన ఉన్న వానపల్లి, కపిలేశ్వరపురం శివారు నారాయణలంక ప్రాంతాల్లో నిమ్మ తోటలను హెచ్ఓ కోటేశ్వరరావు సందర్శించారు. ఈ ఏడాది వరుస వర్షాల కారణంగా నిమ్మలో పూత రావడం ఆలస్యం అయ్యిందని హెచ్ఓ తెలిపారు. అయితే పూత రావడానికి, వచ్చిన తరువాత పూత నిలబడటానికి, నిమ్మను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణ, సస్యరక్షణ చర్యలు తద్వారా అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవలసిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

రావులపాలెం: స్థానిక అరటి మార్కెట్ యార్డ్‌లో ఉన్న మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను సోమవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు తదితర అంశాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఆర్ఐ సుజాత తదితరులు ఉన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో మంచాన పడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.11 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన రాయుడు సత్తిబాబు ఏడాది క్రితం వ్యవసాయ పనుల్లో భాగంగా పొలంలో బస్తాలు మోస్తూ కింద పడిపోయాడు. అప్పటి నుంచి శరీరంలో అవయవాలు పనిచేయక మంచం పట్టాడు. వైద్యం చేయించుకుని స్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో బాధితుడి ఇంటికి వెళ్లి రూ.11 వేల చెక్కును సాయంగా అందజేశారు.



బాధితుడికి చెక్కు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఫ్రిజ్‌లో హిమమహిమ



పూజా మందిరంలో శివ లింగాకృతిలో ఐస్ గడ్డ

కొత్తపేట: మండలంలోని వానపల్లి శివాలయానికి సమీపాన అడపా సుబ్రహ్మణ్యేశ్వర ప్రసాద్ ఇంట్లోని ఫ్రిజ్‌లో శివాలింగాకృతిలో ఐస్‌గడ్డ దర్శనమిచ్చింది. సహజంగా ఐస్ గడ్డ దేనితోనైనా బలంగా పెకిలిస్తేనే గాని రాదు. కానీ ఆ శివలింగాకృతిలో ఏర్పడిన ఐస్‌గడ్డ విడిగానే ఉంది. దానిని శివలీలగా భావించి పళ్లెంలో ఉంచి పూజ మందిరంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వింత గురించి ఆ నోటా ఈ నోటా విన్న స్థానికులు ఆ శివలింగాకృతి ఐస్‌గడ్డను తిలకించి, పవిత్రంగా బొట్లు పెట్టి పూజించారు.

సీసీఎఫ్ సొసైటీ పాలక వర్గం ఎంపిక

మలికిపురం: తూర్పుపాలెం, గొల్లపాలెం సీసీఎఫ్ సొసైటీ పాలకవర్గం ఎంపిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా రాపాక వెంకట నానాజీ, ఉపాధ్యక్షుడిగా దిడ్ల విజయకుమార్, సభ్యులుగా బత్తుల బాల సంజీవరావు, గంటా ఆశీర్వాదం, తోటి గణపతి ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లి దాసు, ముస్కూడి ఏసురత్నం పాల్గొన్నారు.

7న అన్ని పాఠశాల్లో సమావేశాలు నిర్వహించాలి

సఖినేటిపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 7న అన్ని పాఠశాలలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశాలు ఏర్పాటు చేయాలని ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లను ఆహ్వానించి, సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కాగా బడి వైపు ఒక అడుగు కార్యక్రమంలో భాగంగా పై సమావేశాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఆయన అన్నారు. తమ పిల్లలు ఏ విధంగా చదువుతున్నది, వారు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు గురించి కచ్చితంగా తల్లిదండ్రులకు తెలియజేయాలన్న కాన్సెప్ట్ ఈ సమావేశం ఉద్దేశమన్నారు. అలాగే అన్నింటా ప్రగతి సాధించేందుకు వారి ప్రణాళిక కూడా పరిగణనలోకి తీసుకునే చర్యలు ఆయా సమావేశాల్లో చేపడతామన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. నవంబర్ నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలను అందజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

పి.గన్నవరం: నరేంద్రపురం శివారు బూరుగుగుంట గ్రామానికి చెందిన జిత్తుగ శ్రీనివాసరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతని కుటుంబానికి నామన ఫౌండేషన్ ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర వెంగమాంబ, నాయకులు సంసాని పెద్దిరాజు, గుత్తుల రామకృష్ణ, కేదాసి చిన్న, శేరు శ్రీనుబాబు, కొక్కిరి లక్ష్మీ, పెదపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సారా విక్రేతల అరెస్ట్

ఆలమూరు: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలోని ఆలమూరు, మండపేట మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా సారా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్ జరిగింది. ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం సారా విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు మడికి, బడుగువానిలంక, మండపేట మండలంలోని కేశవరం గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మార్గన దుర్గారావు (మడికి), మారిశెట్టి లక్ష్మణరావు (బడుగువానిలంక), కడగల రాముడు (కేశవరం)ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలువురిపై కేసు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురు ఇసుక రీచ్ నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఎంపీటీసీ సభ్యురాలి భర్త గుర్రాల రాంబాబు సోమవారం స్థానిక వీఆర్వో వి.నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కోసం వచ్చిన వీఆర్వో ఇసుక తరలిస్తున్న వారిని ఆపగా వారు ఆన్‌లైన్ బిల్లులు చూపారు. అయితే ఈ బిల్లులకు పంచాయతీ కార్యదర్శి అనుమతి లేదని వీఆర్వో తేల్చి చెప్పాడు. ఇసుక తరలింపునకు ఏ విధమైన అనుమతులు లేని కారణంగా ట్రాక్టర్‌లో ఇసుక దింపేయాలన్నాడు. లేకపోతే ప్రభుత్వ పరంగా చర్యలు తప్పవని వారిని వీఆర్వో హెచ్చరించారు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన పెట్టా వెంకటేశ్వరరావు, పెట్టా ప్రసాదరావు, పెట్టా దినకర్, పెట్టా శ్రీనివాసులు జోక్యం చేసుకుని ఈ ఇసుక తమకేనని వీఆర్వో నాగేశ్వరరావును పక్కకు గెంటి ఇసుక ట్రాక్టర్‌తో సహా పట్టుకుపోయారు. దీనిపై వీఆర్వో ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్‌జోషి తెలిపారు.